ప్రభుత్వ స్కూల్స్‌లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యం

డీఈవో రామారావు



:మాట్లాడుతున్న డీఈవో రామారావు

పామర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచడమే లక్ష్యంగా ఎంఈవోల పర్యవేక్షణలో సీఆర్పీలు పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు ఆదేశించారు. ఎంఈవో కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పీటీఎం సమావేశాలు విజయవంతం చేసేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులకు దిశ నిర్దేశం చేశామని తెలిపారు. గ్రామాల్లో సామాజిక సేవా సంస్థలు, ఎన్జీవోలు తదితర వర్గాలతో సమన్వయం చేసుకుని ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించాలని కోరారు. బడి ఈడు పిల్లలు పనుల్లోకి వెళ్లకుండా బడిలోకి చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్గించాలని సూచించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సీఆర్పీలదే అని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1800 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ ప్రకారం అమలు జరిగేలా సంబంధిత ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బొడ్డు శ్రీనివాసరావు, జి.పద్మవాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు వంశీ కృతజ్ఞతలు



గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం కలిశారు. సతీమణి పంకజ శ్రీతో కలిసి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లిన వంశీ కష్టకాలంతో తనకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీవో ఇమ్రాన్‌కు అభినందనలు

గుడ్లవల్లేరు: ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియామకమైన సందర్భంగా ఎండి ఇమ్రాన్‌ను గురువారం మండల పరిషత్ సిబ్బందితో పాటు, గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బంది జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు తదితరులు ఉన్నారు.

జాతీయ ఖో-ఖో సంఘం సభ్యునిగా ప్రసాదు



గుడివాడ టౌన్: జాతీయ ఖో-ఖో సంఘం కార్య నిర్వాహక సభ్యుడిగా విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు మడకా ప్రసాదు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2029 వరకు ఈ పదవిలో ఆయన కొనసాగుతారు. మడకా ప్రసాదు ఎంపికపై రాష్ట్ర ఖో-ఖో సంఘం అధ్యక్ష కార్యదర్శులు టీఎస్ఆర్‌కే ప్రసాదు, ఎం.సీతారామిరెడ్డి, కృష్ణా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పామర్రు: బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 30 మంది బాధితులకు రూ.21,29,215 అందజేశామని తెలిపారు. పార్టీ నాయకులు పరసా సుబ్రమణ్యం, సందీప్, కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధర మద్యంతో మోసపోవద్దు

సీఐ పి.వెంకటరమణ

గుడివాడ రూరల్: తక్కువ ధరకు మద్యం విక్రయిస్తామనే మాటలతో మోసపోవద్దని మద్యం ప్రియులను గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడివాడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడివాడ టౌన్, గుడివాడ రూరల్, పామర్రు, గుడ్లవల్లేరు మండలాల్లో లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల వద్ద నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల వద్ద కన్నా తక్కువ ధరకు మద్యం ఇస్తామని ఇతరులు ఎవరైనా చెప్తే, ఆ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. నకిలీ మద్యం వలన ప్రాణహాని కలుగుతుందని హెచ్చరించారు. అటువంటి పనులు ప్రోత్సహించే వారు శిక్షార్హులు అవుతారన్నారు. అటువంటి వారి గురించి ఎట్టి సమాచారం తెలిస్తే... టోల్ ఫ్రీ నెంబరు : 14405కు తెలియజేయాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

నేడు శాకంబరీ దేవిగా కొండలమ్మ దర్శనం

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు శుక్రవారం దర్శనమివ్వనున్నారు. ఆలయ ప్రాంగణంతో సహా వివిధ రకాల కూరగాయలు, పుష్పాలతో దర్శనమివ్వనున్న అమ్మవారిని, ఆలయ పరిసరాలను అలంకరించేందుకు గురువారం ఏర్పాట్లు చేశారు. ఈ శాకాంబరీ అలంకరణలో ఉండే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఏటా అధికసంఖ్యలో విచ్చేసి తీర్థ ప్రసాదాల్ని స్వీకరిస్తున్నారు.

మెకానిక్‌లకు కమ్యూనిటీ హాలు నిర్మించాలి

కైకలూరు: నియోజకవర్గంలో టూ వీలర్ మెకానిక్‌లకు ప్రభుత్వం కమ్యూనిటీ హాలు నిర్మించాలని పలువురు మెకానిక్‌లు కోరారు. మెకానిక్ డే సందర్భంగా గురువారం కైకలూరు, మండవల్లిలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మెకానిక్‌లు ఉపాధి పొందుతున్నారంటే దానికి కారణం గాట్లీబ్ డైమ్లర్ అని కొనియాడారు. అనంతరం పెద్ద మసీదు సెంటర్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మెకానిక్‌లు భాస్కరరావు, అమీర్, హరిబాబు, కృష్ణకిషోర్, గోవిందరాజు, జనపాల శివ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

పమిడిముక్కల: మండలంలోని గురజాడ గ్రామంలో మహాకవి గురజాడ అప్పారావు ప్రాంగణంలో శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ రాష్ట్ర కో కన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. గురజాడలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ నూతన కమిటీల ఏర్పాటు, పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు విద్యారత్న అవార్డులు ప్రదానం, చోరగుడి పంచాయితీ కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన తాళ్లూరి వెంకట రమణ సేవలకు పౌరపురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్టీఐ ఏపీ కో కన్వీనర్ దాసరి ఇమ్మానుయేలు ముఖ్య అతిథిగా పాల్గొని సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పెదపూడి పాఠశాల భవనం పరిశీలన



పెదపూడి స్కూల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరిశీలించారు. సుమారు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ పాఠశాల ప్రధాన భవనం అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు. భవన పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో ఫోన్లో మాట్లాడి ఆ పాఠశాల పరిస్థితిని సెల్ ఫోన్ లో చిత్రాలు, వీడియోలు తీసి ఆయనకు పంపారు. దీనిపై కలెక్టర్ స్పందించి విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని విద్యాశాఖ అధికారులతో మాట్లాడానని చెప్పారు. అలాగే పలు అంశాలపై ప్రధానోపాధ్యాయుడు కరుణాకరరెడ్డితో మాట్లాడి సమాచారం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుహాసిని, ఈవోపీఆర్డీ ఎంఎస్ కే పరమాత్మ, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాసు, పరుచూరి సుధాకర రావు, దేవినేని రమేష్, తాతా ప్రభాకర రావు, కూచిపూడి ఎస్సై కేఎన్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు. కూచిపూడి-పెదపూడి ప్రధాన కూడలిలో ప్రపంచ టూ వీలర్స్ డేను పురస్కరించుకుని మొవ్వ మండల టూ వీలర్ సర్వీసస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొన్నారు. ముందుగా టూ వీలర్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరించి టూ వీలర్ ర్యాలీని నిర్వహించారు.

ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు



తోట్లవల్లూరు: మండలంలోని గరికపర్రులో విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా మారాయి. స్థానిక రైస్‌మిల్ సమీపంలోని పొలాల్లో విద్యుత్ తీగలు బాగా కిందకు వంగిపోయి వ్యవసాయ పనులకు అడ్డంకిగా మారాయి. విద్యుత్ తీగలు తొలగించి సమస్య పరిష్కరించాలని విద్యుత్ సిబ్బందికి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తొలగించి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

జనాభా దినోత్సవ అవగాహన సదస్సులు

గుడ్లవల్లేరు: 2025 ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని అంగలూరులోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహినీకుమారి గురువారం తెలిపారు. ఇందులో భాగంగానే పాఠశాల స్థాయి, కాంప్లెక్స్ స్థాయి, మండల స్థాయిల్లో పెయింటింగ్, వ్యాస రచన పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. 'మాదక ద్రవ్యాలు వినియోగం – నివారణ'పై వ్యాస రచన పోటీలు, లింగ సమానత్వం – పరస్పర గౌరవంపై పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. హైస్కూల్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందిన వారిని జిల్లా స్థాయిలో అంగలూరు డైట్‌లో ఈ నెల 9న నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఇందులో గెలుపొందిన మొదటి మూడు స్థానాల వారికి జిల్లాస్థాయి బహుమతులు 11న ఇస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న ఎలక్ట్రోల్ అధికారి రమేష్

పామర్రు: ఎన్నికల నియమ నిబంధనలపై బీఎల్వోలు అవగాహన కల్గి ఉండాలని పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి రమేష్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్నికల విధి విధానాలపై నియోజకవర్గ స్థాయి మాస్టర్స్ ట్రైనర్స్‌లతో పాటు బీఎల్వోలకు ఒక్క రోజు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీలకమైందని చెప్పారు. పామర్రు నియోజకవర్గంలోని 238 మంది బీఎల్‌వోలకు ఈ నెల 9 నుంచి ఓటర్ జాబితా తయారీ, మార్పులు , చేర్పులు అదే విధంగా మరణించిన వారు, వలస వెళ్లిన వారి ఓట్లను పరిశీలించి తుది సమాచారం అందించే విధంగా శిక్షణ తరగుతులను చేపట్టామని పేర్కొన్నారు. చేపట్టే కార్యక్రమాలపై వివిధ పార్టీల ప్రతినిధులకు సమాచారం అందించాలని సూచించారు. 80 ఏళ్ల దాటిన ఓటర్ల వివరాలను తప్పక సేకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.రవికాంత్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ బట్టు రజనీకాంత్, మాస్టర్ ట్రైనింగ్ యార్లగడ్డ మృదుల తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాపై దృష్టి పెట్టండి



వార్డు పర్యటనలో భాగంగా ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

గుడివాడ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై అధికారులు, సిబ్బంది దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. పట్టణంలోని 20వ వార్డు, ఆర్టీసీ కాలనీ, చౌదరిపేట, తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. డ్రెయిన్‌లు మూసుకుపోవడం, భారీగా పిచ్చి మొక్కలు పెరగడం కారణంగా పలు సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాలులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అమృత్ పథకం కింద హౌస్ హోల్డ్ కనెక్షన్‌లు ప్రతి ఇంటికి ఇవ్వడం జరిగిందని అవి సరిగ్గా పనిచేయకపోవడం వల్ల మురుగునీరు చేరి మంచినీటి సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. వెంటనే దీనిపై అధికారులు సమీక్ష నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలుడు అదృశ్యంపై కేసు నమోదు



యలమర్రు(పెదపారుపూడి): గ్రామానికి చెందిన బొమ్మిడి అమర్‌కుమార్ (17) అదృశ్యంపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సరిగా చదవడం లేదని బాలుడి తండ్రి ఏడు కొండలు రెండు రోజుల కిందట మందలించాడు. దీంతో అమర్‌కుమార్ తల్లిదండ్రులకు చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బాలుడి ఆచూకీ గుర్తించిన వాళ్లు 9440113645 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

చర్చనీయాంశంగా కరపత్రాల పంపిణీ

వెంట్రప్రగడ(పెదపారుపూడి): ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని మండల కేంద్రంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేయడం కలకలం రేపింది. మూడు నెలల కిందట జరిగిన ఉపాధి హామీ పథకం పనుల నిధులు దుర్వినియోగం అయ్యాయని అందులో పేర్కొన్నారు. చనిపోయిన వారి పేర్లు, పని చేయని పేర్లు, అనారోగ్యంతో మంచంపై ఉన్న వారి పేర్లు చేర్పించి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లోకేష్ మస్టర్లు వేసి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపణలు చేశారు. కరపత్రంలో మాజీ ఎంపీపీ అని ఉండటం చర్చనీయంశంగా మారింది. కాళ్లు, చేతులు పని చేయనివారు, ఆటో డ్రైవర్లు, హోటల్‌లో పని చేసే వ్యక్తులు, హైదరాబాద్‌లో ఉండే వాళ్లు, వ్యాపారం చేసే వారి పేరున మస్టర్లు వేసి అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు చేశారు. అధికారులతో విచారణ జరిపించాలని పేర్కొన్నారు. దీనిపై ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రంగారావును వివరణగా కోరగా కరపత్రాల వ్యవహారం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించే అవకాశం ఉందన్నారు.

మహిళా సాధికారతపై సర్పంచులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణీంద్ర

కైకలూరు: రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) 2025-2026 వార్షిక ప్రణాళికపై నియోజకవర్గంలోని నాలుగు మండలాల మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. కోడూరు ఎంపీడీఓ జి.సుధాప్రవీణ్, ముదినేపల్లి, కంకిపాడు ఈఓపీఆర్డీలు బి.అశోక్, ఎ.కిరణ్మయి సర్పంచులకు శిక్షణ అందించారు. పర్యవేక్షణ అధికారి కైకలూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర మాట్లాడుతూ నియోజకవర్గం నాలుగు మండలాల్లో మొత్తం 53 మంది మహిళా సర్పంచులు ఉన్నారన్నారు. మొదటి రోజు 48 మంది హాజరయ్యారన్నారు. పంచాయతీరాజ్ చట్టాలు, గ్రామాభివృద్ధిలో ప్రణాళిక రచన వంటి అంశాలపై మహిళా సర్పంచులు అవగాహన చేసుకోవాలని సూచించారు. శనివారంతో మూడు రోజులు శిక్షణ ముగుస్తుందని వివరించారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత



నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందిస్తున్న ఫౌండేషన్ డైరెక్టర్ పీఎస్ఆర్

పామర్రు: అనారోగ్యంతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశామని మనం-వనం ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు(పీఎస్ఆర్) పేర్కొన్నారు. పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు గురువారం సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌తో బాధపడుతున్న కంభం రాణి కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన కాలు విరిగి మంచానికే పరిమితమైన లాజర్ కుటుంబ సభ్యులకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు , దుప్పట్లు పంపిణీ చేశామని చెప్పారు. అంతే కాకుండా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. చిరువోలు రాజేష్, కంభం డేవిడ్‌రాజు, మెండెం రవికుమార్, నత్తా రవి, మనం-వనం ఫౌండేషన్ వాలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు నివాళి

పామర్రు: సీపీఎం నేత బరిగల కోటేశ్వరరావు వర్ధంతి సభను ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. తొలుత కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు శీలం నారాయణ మాట్లాడుతూ కోటేశ్వరరావు ఆనాడు ఆయన చేసిన పోరాటాలు నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నేటి పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. డాక్టర్ సురేష్ చంద్రారెడ్డి, శివనాగేంద్రం, కోటేశ్వరరావు, భీమేశ్వరరావు, రాంబాబు, డి.రఘునాధరావు, రత్నం పాల్గొన్నారు.

ఇంటి వద్దే రేషన్ అందజేత

పామర్రు: వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యాలతో బాధపడుతూ మంచానికే పరిమితమైన బియ్యం కార్డు లబ్ధిదారులకు రేషన్ సరుకులను డీలర్ల వారి ఇంటి వద్దకే వెళ్లి అందిస్తారని మండల పౌర సరఫరాల శాఖ డెప్యూటీ తహసీల్దార్ బీవీ రంగారావు తెలిపారు. మండల కేంద్రంలోని చౌకధరల దుకాణాలను గురువారం ఆయన పరిశీలించారు.

గ్రామాలకు నిలిచిన బస్సు రాకపోకలు



చినపులిపాక వద్ద ఇనుప గడ్డర్

తోట్లవల్లూరు: చినపులిపాక, బొడ్డపాడు గ్రామాలకు గత కొన్ని రోజులుగా ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. కంకిపాడు లాకుల భద్రత దృష్ట్యా ఇరిగేషన్ అధికారులు కంకిపాడు, చినపులిపాక వద్ద ఇటీవల ఆర్ అండ్ బీ రహదారిపై ఇనుప గడ్డర్‌లను ఏర్పాటు చేశారు. కంకిపాడు-వల్లూరుపాలెం ప్రధాన రహదారిలో భారీ వాహనాలను అడ్డుకునే చర్యలలో భాగంగా ఇనుప గడ్డర్లు ఏర్పాటయ్యాయి. దీంతో గత కొన్ని రోజులుగా చినపులిపాక, బొడ్డపాడు గ్రామాలకు ఆర్టీసీ బస్సుల రాకపోకలు స్తంభించిపోయాయి. బస్సుల రాకపోకలు నిలిచిపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కంకిపాడు వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని అంటున్నారు. ఆర్టీసీ బస్సుల్లో తక్కువ చార్జీతో ప్రయాణించే వారమని, ఆటో ప్రయాణం అధిక భారం అవుతోందని ఆవేదన చెందుతున్నారు.

పేదల కోసం పోరాటమే సీపీఐ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్. వెంకటేశ్వరరావు

గుడివాడ టౌన్: పేదలు, కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేసేది సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు అన్నారు. విడిది ఫంక్షన్ హాలులో సీపీఐ గుడివాడ నియోజకవర్గ 23వ మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల్లో పేదలు, కార్మికులు, కర్షకుల సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వాల్లో జరుగుతున్న అవినీతిని ఎండగట్టడం, పథకాలు పేదలకు అందేలా చూడటం తమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్ బాబు, కార్యదర్శి సీహెచ్ సత్యన్నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎ. ప్రసాదు, ఎండి షాదిక్, డి. నరసింహారావు, పి. రంగారావు, పి. శేషు, డి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న రామాంజనేయులు

పామర్రు: సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని టూ వీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పామర్తి రామాంజనేయులు తెలిపారు. స్థానిక కార్యాలయం వద్ద అసోసియేషన్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్ షెడ్లులు ఏర్పాటుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా నిధులు మంజూరు చేయించాలని కోరారు. సభ్యులకు గ్రూపు ఇన్సూరెన్సు సదుపాయాన్ని కలిప్పించాలని విన్నవించారు. అనంతరం సీనియర్ మెకానిక్‌లు అయిన శ్రీనివాసరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పీ నాగ దుర్గా ప్రసాద్, కోశాధికారి గంగాధరరరావు, ముఖ్య సలహాదారులు సుజాముల్క్ ప్రసాద్, ఏసు, మణికంఠ, శివ తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి



కళాకారుడు కోడూరు ఆంజనేయులుని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పామర్రు: ప్రముఖ సినీ నటుడు ఎస్వీ రంగారావు జయంతి ఘంటసాల కళాపీఠం , సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ మాట్లాడుతూ సినీ రంగంలో మకుటంలేని మహారాజుగా ఎస్వీ రంగారావు వెలిగారని కొనియాడారు. తనకు ఇచ్చిన పాత్రలకు తగిన న్యాయం చేసి అన్ని వర్గాల మన్ననలు పొందారని తెలిపారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. అనంతరం ప్రముఖ కళాకారుడు కోడూరు ఆంజనేయులును పుష్పమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాఘవేంద్రరరావు, బి.పద్మజ, పూర్ణ, చిన్నం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్‌కు ఘన నివాళి

కైకలూరు: భారతదేశ చలనచిత్ర పరిశ్రమకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన విశ్వనట చక్రవర్తి సామర్ల వెంకట రంగారావు (ఎస్వీఆర్) చేసిన కళారంగ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు చెప్పారు. ఎస్వీ రంగారావు కల్చరల్ ఆర్ట్స్ నియోజకవర్గ అసోషియేషన్ అధ్యక్షుడు చుండూరి రంగారావు అధ్యర్యంలో కైకలూరులో ఎస్వీఆర్ జయంతిని శంకర్ బుక్‌స్టాల్ వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎస్వీఆర్ చిత్రాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సంఘ గౌరవాధ్యక్షులు నంబూరి హరికృష్ణంరాజు, కేవీఎస్ఎం నాయుడు, సోబుల సత్యనారాయణ, ఏసుబాబు, సుంకర శ్రీనివాస్, కమ్మిలి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తోట్లవల్లూరు: కుట్టు శిక్షణా కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్రబాబుతో కలిసి ఆయన గురువారం సందర్శించారు. కుట్టు శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై గురుమూర్తి, రాజేంద్రబాబు మహిళలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ సక్రమంగా రావటం లేదని వారి దృష్టికి తీసుకువెళ్లారు. మహిళలు తెలిపిన సమస్యలను బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత దృష్టికి ఫోన్‌లో గురుమూర్తి వివరించారు.

కార్మికులు ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు కావాలి



కార్మికులతో సమావేశమైన కార్మిక శాఖాధికారి శ్రీనివాసరావు

గుడివాడ టౌన్: అసంఘటిత రంగంలోని కార్మికులందరూ ఈ-శ్రమ పోర్టల్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని గుడివాడ సహాయ కార్మికశాఖ అధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక లేబర్ ఆఫీస్‌లో అసంఘటిత కార్మికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే అనేక సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శి తులిమిల్లి యేషయ్య, పి. నాగేశ్వరరావు, ఎం. సత్యనారాయణ, పి.కృష్ణయ్య, జె.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.